# అగ్నిపుష్పం

ఉదయాన్నే సన్నాహాలన్నీ ఆరంభమైనాయి. ఆహ్వానించిన వాళ్ళంతా నెమ్మదిగా వచ్చి చేరుతూన్నారు.

శివరావుమట్టుకి యేదో వెలితిగానే వుంది. సుభద్రక్కా, అంకయ్య బావ యింకా రాలేదు.

ఇందిర ఎప్పటికంటె యింకా ముభావంగానే వుంది. ఇంతవరకూ గొట్టెలాగుండే శివరావు యీవేళ పాపకేం పేరెడతాడో చెప్పడంలేదు. అతని కా పట్టుదల వుండడం ఆవిడకి అర్థంకాలేదు.

ఆవిడ పట్టుదలస్వభావం విషయంమాత్రం శివరావుకి తన పెళ్ళి అయిన కొద్దిరోజుల్లోనే తెలిసింది.

పెళ్ళికొచ్చిన వారంతా యెక్కడివా ళ్ళక్కడికి వెళ్ళిపోయాక, కొన్నాళ్ళపాటు యిల్లుదిద్ది, క్రొత్తకోడలికి కాస్త అలవా టయ్యేవరకూ వుండి మరీపోదామని, సుభద్రక్క-అంకయ్యగారూ వుండిపోయారు. ఇందిరతండ్రి కృష్ణమూర్తిగారు, దూరదేశం కలకత్తా తిరిగి వెళ్ళిపోవాలి గదా అని, సెలవు కాస్త పొడిగించుకొని మరీ వుండిపోయారు. ఇహను వీళ్ళంతా వెళ్ళటం దగ్గరబడ్డ ఒకరోజున సుభద్రక్క అందరికీ కాఫీలూ, పలహారాలూ వడ్డిస్తోంది. ఇందిరమట్టుకు, తన ప్లేటులో పలహారం తిన కుండా చేత్తో కెలికి కెలికి పడేసుకుంటోంది. ఇది గమనిస్తున్న శివరావు, "దానికా పలహారం సహించకపోతే మరేంకావాలో అడిగి మరీ చెయ్యక

పోయావా అక్కా-" అన్నాడు సుభద్రతో. ఇందిర వెంటనే ముఖం ముడుచుకుని పలహారం వదిలిపెట్టి విసురుగా వెళ్ళి చెయ్యి కడుక్కుంది.

నీవు నోరువిప్పి చెప్పకపోతే యెల్లా తెలుస్తుందమ్మా ఇందిరా, మాకు !" అంది సుభద్ర.

అసలా మనస్సులో యేమేమి వూహలున్నాయో తెలుసుకోడం ఎలా చెప్మా అనుకున్నాడు అంకయ్య.

కృష్ణమూర్తిగారుమాత్రం సంతృప్తిగా చిరునవ్వుతో "అసలు మా అమ్మాయి యెవ్వరు ఏదిచెప్పినా వినదుగా, దానికే తోచాలి. అప్పుడు చేస్తుంది. దానికి బుద్ధిపుడితేనే మాటలైనా ఆడుతుంది. ఏది వద్దన్నామో తప్పకుండా ఆ పనే చేస్తుంది" అన్నాడు : "ఇంతెందుకు ? దాని చిన్నప్పుడు, వాళ్ళవ్వగారు బ్రతికున్నరోజుల్లో, పల్లెటూళ్లో, ఆడుకుంటూ ఆడుకుంటూ క్రిందపడివున్న పెద్ద, ఎర్రటి ఎద్దు మెడపూస ఒకటి ముక్కులో పెట్టుకుంటోందిట. ఆ పూస జారి క్రింద పడిపోతోందిట. వాళ్ళవ్వగారు దూరాన్నుంచి చూసి 'ఒసేవ్ ఒక్కటి గుద్దుతాను, ఆ పూస కింద పడెయ్యి. చస్తావ్!'అని అరచిందట. అంతే! ఇహ నా పూసని క్రిందపడనివ్వకుండా ముక్కులో పెట్టుకుని లోపలికి తోసుకుంటోందిట. ఆవిడ మళ్లా అరిచింది, దూరాన్న పనిచేసుకుంటూ. అరిచినకొద్దీ పూసని యింకా లోపలికి తోసిందట, ఇది. ఆవిడ పరుగెత్తుకుంటూ వచ్చి అన్నంతపనీ చేసిందట. అంతే తలమీద నాలుగు గుద్ది, దీన్ని తుమ్మించి, ఆ పూసని బలాత్కారంగా పయటికిలాగేసిందట" అన్నారు.

ఒక్క క్షణం యెవ్వరూ మాట్లాడలేదు. సుభద్రమాత్రం బాధగా "ఏంపని అమ్మాయ్ అది ? ఇంకా నయం. ఆ పూస అల్లాగే ముక్కు చివరంటా వెళ్ళిపోతే ? ఆపరేషన్ చేయించాల్సివచ్చును. ఇంత చక్కగా వున్న యీ ముక్కూ-ముఖమూ చెడిపోనుగదా. అల్లాంటిపనులు తప్పమ్మా"

అంది. "తల్లిలేని గారాబంపెంపకం" అన్నారు సుబ్రహ్మణ్యంగారు, శివరావుతండ్రి—మాటసర్దుతూ.

కాని, సుబ్రహ్మణ్యంగారికి లోపలమాత్రం ఒకప్రక్క బాధగానే వుంటోంది పెళ్ళిలోనుంచే. గొప్పయింటి సంబంధమని, చాలాయేళ్ళ క్రితమే వ్యాపారవిషయంలో కృష్ణమూర్తిగారి సహాయం కావలసి, సంబంధం మాట యిచ్చినందువల్లనూ కోరి చేశాడు యీ పెళ్ళి. ఐనా, కాళ్ళకి మొక్కమంటే పెళ్ళికూతురు మొక్కలేదు. నించునే వుండి పోయింది. వంగనేలేదు. పెద్దలూ, పేరంటాళ్ళూ ముఖముఖాలు చూచు కున్నారు. మామగారి ముఖం చిన్నబోయింది. ఎవర్ని యేమంటే ఏం లాభం ? చేసుకున్నమ్మకి చేసుకున్నంత అనుకున్నా రందరూ.

సరి, అది ఆనాటిమాట.

ఇప్పుడు యీ శుభకార్యం నడవాలే. అక్కా-బావ దగ్గరలేకుండా తన కూతురికి నామకరణం చెయ్యబుద్ధికావటంలేదు, శివరావుకి. కాని, చెయ్యాలి.

మధ్యాహ్నం తిరిగేటప్పటికి పాపకి పేరెట్టేశారు. వచ్చినవాళ్ళంతా "శుభం" అని వెళ్ళారు.

తరువాత శివరావు వచ్చేపోయే బండ్లు చూస్తూ గోడకి జారగిలబడి బయటరుగుమీద కూచున్నాడు.

శుభమూ-అశుభమూకూడా సుభద్రక్క, అంకయ్యబావా లేకుండా యీ యింట యెన్నడూ జరగలేదు. ఆఖరికి మనస్సు నిలవక, వాళ్ళకోసం నిన్న సాయంత్రం ఒక తంతి యిచ్చేశాడు శివరావు. సావకాశంగా వుత్తరం వ్రాసి వున్నట్టయితే వాళ్లెప్పుడో వచ్చివుందురు. అంతా వాళ్ళ చేతులమీదనే అవును. ఐతే వ్రాయడం పడలే. వ్రాసే పరిస్థితులూ కాక పోయినాయి. ఇన్నాళ్ళూ వాళ్ళకి వ్రాయకుండా వుండటం తప్పే ! కాని దానికి కారణం ? లేకపోలేదు.

ఎంత గాథ వుంది.

పెళ్ళికివచ్చిన సుభద్ర వెళ్ళేటప్పుడు "ఒరేయ్! మావూరు నీ కేపైనా పని తగిలితే యిద్దరూ రండిరా. మా దగ్గర ఓ నాలుగురోజులు వుండివస్తురుగాని" అంది. ఆ మాటకి ఇందిర యెవ్వరూ లేనపుడు "మీ అక్క పిల్చారుగా! ఇంక మేమెందుకు? వెళ్ళరాదూ. నెత్తినపెట్టుకుని చూస్తారు" అంది, శివరావును దెప్పిపొడుస్తూ.

కొన్నాళ్ళయ్యాక శివరావు "ఇదిగో, ఇందిరా! నా పెళ్ళికి ఎంతో మంది నా స్నేహితులు సదంపతుల్లుగా వచ్చారు. వాళ్ళల్లో కొంతమంది కొద్దో-గొప్పో చదువుకున్నవాళ్ళే. ఔను, ఆనాడు నిన్నెంతో కలుపుగోలుతనంగా చూచారు. నువ్వే మాట్లాడలేదుగాని; అంటే నీకు క్రొత్తగదూ మరి. అంచేత నువ్వూ వాళ్ళతో కలవలేకపోయావులే. ఐనా నీమీద యెంత ప్రేమోచూడు వాళ్ళకి. ఎన్నెన్ని బహుమతులిచ్చారో నీకున్నూ" అంటూంటేనే మధ్య నందుకుని "మే మిమ్మన్నామా? మేమేమంత లేనివాళ్ళం కాదులెండి" అంది తిరస్కారంగా. శివరావు ఖిన్నుడై పోయాడు. ఐనా నిభాయించుకుని "అదికాదు, ఇందిరా! మనం తిరిగి మర్యాదకి వాళ్ళిళ్ళకి వెళ్ళి చూడాలిగా, అందుకని. బట్టలు కట్టుకో. ఇద్దరమూ వెళదాం రేపు ఆదివారం" అన్నాడు.

"మేమేమీ చదువుకున్నవాళ్ళం కాము, సింగారించుకుని, మొగాళ్ళతో భుజాలు తగుల్చుకుంటూ వూరేగటానికి. నేను రాను" అంటూ కూర్చున్నచోటునుంచి లేచిపోయింది. శివరావు మనస్సు క్రుంగిపోయింది. ఏ కొరతా లేకుండా, ఏ బాధా తగలకుండా, బాధ్యతాయుతంగా భార్యని చూచుకుందామంటే, ఎప్పటికప్పుడు యెదురుదెబ్బలే తగుల్తూన్నాయ్.

"నీ కేమన్నా యిది మూర్ఖమా? లేక ప్రపంచంలో యెవరన్నా గిట్టదా?" ఈ ప్రశ్న పైకి అనే ధైర్యం లేకపోయిం దతనికి.

ఐతే అమ్మలక్కలు కొంతమందిమాత్రం "ఆ పెళ్ళిలో ఏదో గర్వ మనుకున్నాంగాని సిగ్గల్లేవుంది. గిఖ్ఖమన్న మాటన్నా వినిపిస్తోందేమో చూశావూ, సుబ్రహ్మణ్యంగా రింట్లోనుంచీ! నోట్లో నాలికలేదుగదా వాళ్ల కోడలికి. నల్లననదు తెల్లననదు. తన యిల్లేమో తానేమో. మనకీ వున్నా రుగా కోడళ్లు. వాళ్ల వికవికలూ-పకపకలూ, వాళ్ల గందరగోళమే వాళ్లది. ఊఁ అంటే కయ్యానికి కాలుదువ్వతారు" అనుకుంటూండేవాళ్లు.

ఒకనాడు శివరావు "నాన్నగారికి ఎప్పుడెప్పుడు ఏమేమి కావాలో అందిస్తూండు సుమా. మందులూ అవీ సరిగ్గా యియ్యి" అన్నాడు ఆఫీసు కెళుతూ.

"మీకూ మీవాళ్లకీ పనిమనిషి కావాలని పెళ్లాడారని నాకు తెలి యదు" అంది ముఖం ముడుచుకుని, ఇందిర.

దీనితో గొట్టె కరచినవాడిలా ఆశ్చర్యపడ్డాడు శివరావు. తన ఆర్థిక స్థితి అంతా తెలిసేగా పెళ్లిచేశారు? మరుగు ఏమీలేదే!

ఆ రోజంతా అతనికి ఆఫీసులో పని తోచలేదు. సాయంత్రం యింటికి రాబుద్ధికాలేదు వెంటనే. మనస్సు శాంతికోసం అల్లాడుతోంది. కాళ్లు అప్రయత్నంగా, చిన్నతనంనించీ, తల్లి పోయినతరువాతా, కాలేజీ సెలవులకి వచ్చినప్పుడూ, ఒంటరిగా కాసేపు ప్రశాంతిగా గడిపే కాలవ ఒడ్డుకి యీడ్చుకొచ్చినాయి. అక్కడ గడ్డిమీద చతికిలబడ్డాడు. చుట్టూ పచ్చటి పొలాలూ, అక్కడక్కడా గట్టుమీద చెట్లూ, కనుచూపుమేర చుట్టూ అంతా నిశ్శబ్దం. తన శ్వాస తనకే వినిపిస్తోంది.

నిట్టూరుస్తూ తనముందర కాలవకేసి చూస్తూ వుండిపోయాడు. ఇది మంచినీటి కాలువ. కాస్త పైగా ఎర్రకాలువ దీనితో కలిసింది. రెండు కాలువలూ కలిసి ఒకటిగా ప్రవహిస్తోంది. అందువల్లనే కాబోలు యీ కాలువపొడుగునా, ఒక ప్రక్క ఒకరంగూ, రెండో ప్రక్క మరో రంగుతో

కాలువమధ్య గీత గీసినట్టూ, రెండురంగులతో నీళ్లు కలువకుండానే వేరు వేరుగా ఒకే కాలువగా ప్రవహిస్తున్నాయి. ఇల్లా యెక్కడికో వెళ్ళి పోతోంది యీ కాలువ. తన జీవితమూ అంతే ననిపించింది శివరావుకి. అసలే శూన్యమైన తన చీకటిబ్రతుకులో క్రొత్తబరువుల భారం కని పించింది. దానితో తన శరీరమే మొయ్యలేని బరువుగా తోచింది. నిస్పా రంగా ఆకాశంకేసి చూస్తూ, తలక్రింద రెండుచేతులూ ముడుచుకుని, వెల్లికిలగా గడ్డిమీద పడుకున్నాడు.

సరిగా యిదే తీరుగా, ఒక సంవత్సరంక్రితం తను పుద్యోగం చేస్తున్నప్పుళ్లో, చిన్న మిద్దెమీద పడుకున్న రాత్రి జ్ఞాపకవచ్చిం దతనికి.

ఎన్ని ఆశలతో ఆ మిద్దెయిల్లు బాడుగకు తీసుకున్నాడో, ఉద్యోగం అవంగానే. ఇప్పుడా యింట్లో ఒంటరిగా కాలం వెళ్ళబుచ్చు కుంటున్నాడు. నిద్ర పట్టడంలేదు. నుదిటిమీద చెయ్యి చాచుకుని, అలో చనగా పైకి ఆకాశంకేసి చూస్తూ పండుకున్నాడు. పైన చిన్న లేత మబ్బులు అక్కడక్కడా అలుముకున్నాయి. భోజనం సయించలేదు, యీవేళ సరీని. కాని, కడుపులో ఆకలి తెలియటంలేదు. చుట్టూ ప్రపంచ మంతా నిద్రలో పండుకుంది. ఆకాశంమీద లేత వెలిమబ్బుక్రింద ఒకే ఒక తెల్లటి కొంగ, ఒంటరిగా బేక్ బేక్ మని అరుచుకుంటూ స్వస్థలానికి ఎగిరిపోతోంది—జపానువారి లేతరంగుల చిత్రం స్ఫురణకుతెస్తూ.

పాపం! ఆ కొంగ యేమరిపుంటుంది, తన బృందం అంతా ముందరే వెళ్ళిపోయారుగావును. ఇది వొంటరిగా వెడుతోంది అను కున్నాడు శివరావు. ఏం? అక్కడికి వెళ్ళకపోతే? ఉన్నచోటే వుండి పోకూడదూ ఆ కొంగ. ఇంత రాత్రిబడ్డాకూడా యేదో గూడూ, పిల్లా-

జల్లా—తన బృందం కావాలల్లేవుంది. అందుకే యేదో పడిపోయినట్టు పోతోంది.

నాన్నగారి వుత్తరమూ, దాన్ని వెన్నాడుతూ వచ్చిన టెలిగ్రామూ కళ్ళముందు కొచ్చినాయి. ఆయనని కష్టపెట్టడ మెందుకు ? ఔను. ఆయనని కష్టపెట్టి తను సాధించే దేముందిగనుకను ? ఇంతకీ నాన్నగారు బాధపడేస్థితిలో వున్నారా ? ఈ మధ్య ఆరోగ్యం బాగా క్షీణించిపోతోం దాయె. ఆర్థికంగానూ ఇటీవల దెబ్బతగిలింది. తనని కనిపెట్టుకుని వుండ డానికీ, సంసారం దిద్దడానికీ ఒక దిక్కావసరమేగా ! తను ఒక్కడేగా ఆ వృద్ధుడికి అండ. తను వుద్యోగం చెయ్యవలసిన అవసరంవచ్చే. ఆడ దిక్కావసరం. పవిత్రప్రేమకి తాను నోచుకోలేదు. జీవితాన్ని ముంచెత్తిన మధురస్మృతికి ద్రోహం చెయ్యగలడా ? తను నిర్జీవజీవితం గడపాలి. ఎవ్వరికోరకు ? "ప్రేమలో త్యాగం వుండాలి. త్యాగంలేని ప్రేమ స్వలాభమే అవుతుంది బావా." ఆ దివ్యవాక్కులు యింకా వినబడుతూనే వున్నాయి, ఆకాశవాణిలా. త్యాగం చెయ్యనా ? చేస్తా. నాన్నగారికోసం. సరే—రేపే బయలుదేరతా. ఆ పెళ్ళికూతురు ఎవ్వరో యేమో ! ఎవ్వరైతే యేం ? ఏ రాయైనా వాకచే పళ్ళూడగొట్టుకోడానికి.

ఆ జ్ఞాపకాలన్నీ దిగమింగి కాలువవొడ్డునించి సందెదీపాలవేళకి యిల్లు చేరుకున్నాడు శివరావు.

రోజులు గడుస్తున్నాయి.

ఒకనాడు యింటికొచ్చేసరికి సుభద్రక్కనుంచి వుత్తరం వచ్చింది. ఎవ్వరో, అతనికంటే ముందే అది చించి చదివారు. ఇందిరకి యేడవ మాసం రాగానే, తను వచ్చి శాయశక్తులా తోడ్పడతానని వ్రాసింది, అక్కగారు.

శివరావు కళ్లు చెమ్మగిల్లినాయ్. అక్క దేవతలలో యెన్నుకోదగినది. అవునుపాపం! ఇందిరకీ తల్లి లేదుగా. తల్లిలా సుభద్ర అండగా వుంది. ఇందిర అదృష్టవంతురాలు. తనూ భార్యని తల్లిలేని కొరత లేకుండా చూచుకోవాలని నిశ్చయించుకున్నాడు.

ఉత్తరం చేతపట్టుకుని, ఇందిరవద్దకొచ్చి "ఈ వుత్తరం చదివే వుంటావుగా ఇందిరా? అక్కని రమ్మని వ్రాద్దామా మరి. నీవే వ్రాయి" అన్నాడు శివరావు. మారుమాటాడకుండా, నించున్నచోటనించి గిరుక్కున వెనక్కి తిరిగి చరచరా వెళ్ళిపోయింది ఇందిర. శివరావునోట మాట రాలేదు. వెనక్కి తిరిగి, తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఇందిర, తాను వివాహమాడిన భార్య. దానిని ప్రేమించకుండా వుండడానికి తనకి హక్కులేదు. పెండ్లాడకనే వుండాలి. పెండ్లాడిన తరువాత ప్రేమించి తీరాలి. ఇందిరని ప్రేమించడానికి ప్రయత్నించి ప్రేమిస్తూనే వున్నాడు. లేదనడానికి వీలులేదుకాని అది వేరు. తనువు మరచి నిట్టూర్చినప్పుడు, కళ్ళనిండా నీళ్లు తొణికిసలాడినప్పుడు, గొంతుకలో యేదో స్తంభించిపోయి గుండె గబగబా కొట్టుకున్నప్పుడు, హృదయాంతరాళలలో తీర్చి చెప్పలేని, ఒక నిండు పొంగు, అదేదో, అది మాత్రం కాదు. అది పిలుపుకందని ఆ దివ్యమూర్తికే చెందినది. ఆ పిల్లని తల్చుకున్నప్పుడే ఆ అనుభూతి; ఆ ప్రేమకి అతను దాసుడు. దానికీ తన యీ నిత్యజీవితానికీ సంబంధంలేదు.

ఆ మరునాటి వుదయాన శివరావు బయట కొచ్చేసరికి, వెనక వసారాలో కుంపటి వెలిగెస్తోంది ఇందిర—అతి నిర్లక్ష్యంగా. శివరావుకి గాభరా అయిపోయింది. "అరే! అరెరే! నీకుగాదూ, చెప్పేది? ఎన్ని సార్లు చెప్పను? నిప్పు! నిప్పు భద్రం అన్నానా? ఎన్ని సార్లు? బుద్ధి

వుండాలి! అసలే పల్చటి చీరలాయె! అయ్యో! దేముడా!" అనికోపంగా కొట్టొచ్చినట్టూ, గాభరాగా అన్నాడు.

ఇందిరకి యీ ధోరణి అర్థంకాలేదు. మరీ ఒళ్లు మండుకొచ్చింది.

"ఏం, పల్చని చీరలు చదువుకున్నవాళ్ళేగాని మాలాంటి మోటు గొడ్లు కట్టుకోకూడదా? మా జాగ్రత్త మాకు తెలుసు. మీరు మాకు చిన్నపిల్లలకి చెప్పినట్టూ యేం చెప్పనక్కర్లే" అంది యీసడింపుగా, శివరావు ముఖం చిన్నపుచ్చుకున్నాడు.

కాస్సేపయ్యాక, కాఫీ తీసుకుని గదిలోకి వెళ్ళింది. శివరావు గది మధ్య నించునివున్నాడు—అటుతిరిగి—ఎదురుంగా గోడ నానుకునివున్న మేజామీదినించి గోడకేసి చూస్తూ. ఇందిర మాట్లాడకుండా కాఫీ టేబిలు మీద పెట్టి వస్తూ, అటు గోడప్రక్కగా చూచింది. మేజాప్రక్కనున్న కిటికీలోనూ యెవ్వరూ లేరు, గోడమీద టేబిలుకి పైగా ఒక కాలేజీ గ్రూఫ్-ఫొటో తప్ప. ఇందిర మనస్సులో యే బాధా, ఏ ఆలోచనా సోకలేదు.

కాని, జీవితం ఒక్కొక్కసారి దుర్భరం అనిపిస్తోంది, శివరావుకి. ఎన్నాళ్ళో యెక్కడికో, ఈ తుదిలేని జీవితయాత్ర. ఏదో గతజన్మలో జరిగినట్టున్నది: తను విన్న స్వరమూ, తను చూచిన చేష్టలూ, దీవెనలా తనమీద వాలిన చూపూ. అబ్బ! అనుక్షణమూ తనచుట్టూ వున్నాయి, ఆ స్ఫురణలు తనలోనే వున్నాయి. తానే ఆ స్ఫురణ—తాను వేరేలేదు.

మరోనాడు తన గది కిటికీలోనించి పెరట్లోకి. చూస్తూ నిలబడ్డాడు శివరావు. ఎదురుగా పెరట్లో, చుట్టూ వెదురుబద్దలు పాతి గూడులాగు కట్టిన గులాబీ పూలచెట్టుకి చుట్టూవున్న బద్దలన్నీ తీసేసి, చెట్టుక్రింద వాటంతటవ్వే రాలి పడివుండే, ఎర్రగులాబీ పూలరేకులన్నీ, శుభ్రంగా తుడిచిపారేశారు యెవ్వరో. చెట్టు బావురు మంటోంది. శివరావుకి

ఒళ్ళంతా చెమట్లుపోసినట్లయింది. అది అతని ఆరాధ్యదైవం అతని కిచ్చిన యెర్ర "డామస్క్" గులాబీచెట్టు. అప్పటినించి తన కూడానే వుంది అది. ఆ చెట్టుదగ్గరికి యెవ్వరూ వెళ్ళకుండా ఆ చెట్టుని ఎవ్వరూ అంటుకోకుండా, ఆ పువ్వులు యెవ్వరూ కొయ్యకుండా వుండేటందుకే అంత బందోబస్తు చేశాడు.

ఒక్క అడుగులో పెరట్లోకి వచ్చాడు శివరావు. నూతిదగ్గర బట్ట లుతుకుతూన్న పనిమనిషిని "ఎవరు యీ పని చేశారు ? అ చెట్టుదగ్గిరికి యెవ్వరూ వెళ్ళకూడదని నే నెన్నిసార్లుచెప్పాను—ఏం చెప్పు ? ఎందుకా పువ్వులన్నీ తుడిచిపారేశావు ?" అని గబగబా గట్టిగా అరిచాడు. "ఆ ఎదురుబద్దలన్నీ స్థలం మింగేస్తావుండాయని, ఆ శెట్టుచుట్టూ పువ్వులూ ఆకులూ రాలి అడివిలా గుండాది శుబ్బరంగా తుడిశెయ్యమని అమ్మగారు శెప్పారుండి. ఆమెకి శుబ్బరం లేకపోతే శానా శికాకుపడతారుగదయ్యా, అందుకని" అన్నది భయంగా, పనిమనిషి.

శివరావు కాళ్ళీడ్చుకుంటూ తనగదిలోకి వచ్చి, మేజావద్ద కుర్చీలో కూలబడ్డాడు. కరుడుగట్టుకుపోయిన స్మృతులన్నీ, ఒక్కసారి దేవుడి ముందు వేసిన పరిమళ ధూపాలలా పైకి లేచినాయి.

ఎన్నిసార్లు యెంత ఆప్యాయంగా తన పెట్టె సర్దిపెట్టేది ఆ ప్రేమమూర్తి. హాస్టల్‌నించి యీ వూరు వచ్చేటప్పుడూ, తిరిగి హాస్టల్‌కి వెళ్ళేటప్పుడూ తను వాళ్ళింట్లో మకాం లేకుండా వచ్చేవాడేగాదు. కాలేజీలో రోజూ చూస్తున్నా, తిరిగి సాయంత్రం పుణ్యక్షేత్ర యాత్రలా వాళ్ళింటికి వెళ్ళేవాడు. ఆఖరిరోజుల్లో నాన్న ఒకసారి వాళ్ళింటి కొచ్చి నప్పుడు, అనుమానం పడ్డట్టుగా వుంది, ఆ పిల్లనీ, వాళ్ళవాళ్ళనీ ఏదో అన్నట్టుగా వుంది, తను దగ్గరలేనప్పుడు నాన్నగారు. ఆతరువాతనే ఆ దేవత శివరావుతో అన్నది "బావా ! మేము బీదవాళ్ళం. మీ అంతస్తుకి

తూగలేము. నేను మరెవ్వరినీ పెండ్లాడను—ఆడలేను. ఆ తలపే అసహ్యం. నిన్నే తల్చుకుంటూ జీవితమంతా గడుపుతాను. మీ నాన్న గారికి మా సంబంధం యిష్టంలేదు. ఆయన్ని కష్టపెట్టవద్దు. నీవుతప్ప యెవ్వరూలేరు ఆయనకి. ఆయన యిష్టంవచ్చిన సంబంధం నీవు సుఖంగా పెండ్లాడు. నీవు సుఖంగావుంటే నా కదే చాలు" అంది వెక్కి వెక్కి యేడుస్తూ. "నీవులేని బ్రతుకుకంటే చావడమే మేలు" అన్నాడు శివరావు ఖచ్చితంగా. "మృత్యువు మృతులకికాదు బావా, దాని బాధ మిగిలివున్నవాళ్ళకే" అంది ఆ అమ్మాయి.

ఆనాడు నిశ్చయించాడు శివరావు—తన తండ్రిమీద ఆర్థికంగా ఆధారపడకూడదనీ, తను ప్రత్యేకంగా యేదో ఒక వుద్యోగం చేసుకుని, తండ్రి సమ్మతించకపోయినా, ఈ పిల్లదానిని పెండ్లాడితీరాలనీ.

ఆ వుద్యోగంలో చేరడానికి వూరువెళ్ళేటపుడు మళ్ళీ వాళ్ళింట్లో దిగాడు శివరావు. ఆనాడు యిచ్చింది యీ రోజాచెట్టు. అపుడు సరిగ్గా మూరెడు అంటు. బంగారుకలశంలాగా తొట్టెని ఆ వూరు చేర్చుకున్నాడు తనతోకూడా.

ఆలోచనలతో, ఆశలతో కాలం గడుపుతున్నాడు శివరావు వుద్యోగి అయి.

సంవత్సరం గడవవచ్చింది. పెద్ద తొట్టిలో స్వయంగా నీళ్లుపోస్తూ పెంచుతున్నాడు గులాబీమొక్కని.

"ఎల్లుండి నాకు కాన్వకేషను బావా. చక్కని ఆశీర్వాదాలు పంపు" అని వుత్తరంవచ్చిం దతనికి. వరసకి తను బావ కాకపోయినా, ఆ పిల్ల అతన్ని యెప్పుడూ అల్లాగే పిల్చేది.

"ఉద్యోగం క్రొత్తది. నాకు సెలవు దొరకదు. నీకూ చదువు యేదో పూర్తైందిగనుక, మీవాళ్ళ నడిగి తొందరలోనే పెండ్లి నిశ్చ

యిస్తాను. నిన్ను రథంమీదపెట్టి తెచ్చుకుంటాను. నాన్న చచ్చినట్టు ఒప్పుకోవలసిందే. లేకపోయినా యిబ్బందిలేదు. నా కేదే కొద్ది జీతపు రాళ్లు వస్తున్నాయిగా, పెళ్ళయ్యాక నా కంట్లోనించి నిన్ను మరుగు చేసుకోను యిక యెన్నడూ. ఇప్పుడు ఒక్కటే నా ప్రార్థన. నీ విచ్చిన కానుక తొలిపువ్వు పూసింది. రేపటికికూడా ఆ రేకలు రాలకుండా వుండ టానికి ఆ పువ్వుక్రింద పచ్చని ఆకుపెట్టి సుతారంగా అమిర్చాను. అది అట్టపెట్టెలో పెట్టి, నా స్నేహితుడు ఆ వూరు వస్తూంటే, అతనికిచ్చి పంపుతున్నాను. ఉత్తరమూ, పువ్వున్నూ" అని వ్రాశాడు బదులు.

ఆ రాత్రి యెన్నో ఆశలతోనూ, ఊహలతోనూ మరచి నిద్ర పోయాడు శివరావు.

ఆ అమ్మాయి, ఆ వుత్తరమూ, ఆ ముదురు కుంకుమరంగు గులాబీపువ్వూ కళ్ళ కద్దుకుని మేజామీద పెట్టుకుంది, పట్టలేని తృప్తీ-సంతోషాలతో. సంతోషంగా యీవేళ అమ్మకి నాన్నకి స్వయంగా కాఫీ చేసి యిద్దామని స్టౌవ్ వెలిగించింది.

అంతే. అనుకోనిసంగతి-భయంకరం. చెంగుకి నిప్పంటుకుంది పొరపాటున. ఎల్లాగంటుకుందీ తెలియదు. ఒక్క క్షణంలో హాస్పి టలుకి చేర్చారు, తల్లీ, తండ్రీ గగ్గోలుపెడుతూ.

టెలిగ్రాం అందగానే, తన తల యెవ్వరో కొట్టేసినట్టయింది శివరావుకి. ఆతరువాతది ఒక ప్రణయగాథ.

రెండుమెట్లొక్కసారిగా ఎగిరి పైకొచ్చాడు శివరావు. ఆస్పత్రిలో రోగి గదిలోనుంచి అప్పుడే బయటికొస్తున్న, వయస్సుమళ్ళిన డాక్టరు శివరావు భుజంమీద చెయ్యివేసి ఆపి, దగ్గరగా లాగుకుంటూ "అదృష్ట హీనుడా! ఒక క్షణం ఆలస్యంగా వచ్చావు. ఇప్పుడే మతి ఆఖరుగా ఒక్కసారి వచ్చింది. నీ కోసమే అల్లాడింది. నిన్నే మరీ మరీ అడిగింది.

ఎవ్వరిదీ ద్రోహంలేదు. కావాలని యెవ్వరూ హాని చెయ్యలేదు. ఎవరికి వాళ్ళం కావాలని కీడు చేసుకోంకదా! కాని సుఖంకోసం యెంత ప్రాకు లాడినా ఒక్కొక్కసారి దుఃఖం తప్పదు. పూర్వకర్మానురూపం. ధైర్యంగా వుండు. ముఖం బాగానే వుంది....తయారుచేసి నర్స్ పిలుస్తుంది. నిన్ను లోపలికి తీసుకువెళతా" అన్నాడు.

ఈ జ్ఞాపకాలతో శివరావు గుండెలు తల్లడిల్లినాయి. నిలువెల్లా వణికాడు.

మధ్యాహ్నం భోజనానికి పిలవడానికి ఇందిర గదిలోకి వచ్చింది. ఆ అలికిడికి చటుక్కున వెనక్కి తిరిగాడు, శివరావు. అతని కళ్లు ఎర్రబడి వాచివున్నాయి. ఇందిర చూచింది. ఆ ముఖంలో కనిపిస్తున్నదాధకి కారణం ఏమీతెలియలేదావిడకి. మేజామీద అతని కెదురుగా గోడకి తగిలించివున్న కాలేజీపటం కంటపడింది. ఒక్కసారి దానికేసి చూసింది. నాలుగైదు వరసలు మగ విద్యార్థులు నించునీ, కూర్చునీ వున్నారు. క్రిందవరసలో కుర్చీలలో మధ్యన కూచుని ఐదుగురు ఆడపిల్ల లున్నారు. ఈ పటానికి అర్థం యేమిటో ఆవిడకి అర్థంకాలేదు. ఆ పటంలో గుంపుని అంత ఆలోచనగా చూడడం దేనికి? తన కాలేజీ రోజులు అంత మధురమైనవా? ఏమిటో, ఆ పటాన్నిగాని, శివరావు మూగబాధనిగాని ఇందిర అంత పట్టించుకోలేదు.

ఇందిరకి ఏడవనెల వచ్చాక సుభద్ర వుత్తరాలు దగ్గరదగ్గరగానే వస్తూన్నాయి. ఈసారి ఇందిర గట్టిగానే నోరు చేసుకుంది. "ఆవిడ సహాయం మాకేం అక్కర్లేదు. ఆసుపత్రిలో పురుడు పోసుకోగలను. ఆవిడ మీ స్వంత అక్కేం కాదుగా. పెద్దతండ్రికూతురుమీద మీ కింత ఆప్యాయత యెందుకు?"

"నాకు ఆప్యాయత యెక్కువకాదు ఇందిరా. ఆవిడకే ఆపేక్ష యెక్కువ. నిన్ను యింతగా ప్రేమిస్తున్న అక్కని కొంచెమైనా తిరిగి ప్రేమించలేవా?" అన్నాడు.

"ఏం ప్రేమో ! ప్రేమా చట్టుబండలున్నూ! ఏదో నవలలో చెప్పి నట్టు, నా చేతగాదీ ప్రేమించటం యేమిటో" అంది.

"తప్పు ఇందిరా. నేను కాలేజీకి వెళ్ళేటప్పుడూ, ఆఖరికి యింటి కొచ్చేటప్పుడుకూడా అరిశెలూ, లడ్డూలూ చేసి డబ్బాలలో వేసి చేతి కిచ్చేది. తలంటిపోసి ఆదరణ చూపేది. అది తప్ప నా కెవ్వరూ లేరు ఇందిరా. ప్రేమించేవాళ్ళు వుండటం అదృష్టం. తల్లీ, తోబుట్టువులూ లేని దరిద్రుడను నేను" అని గది లోపలికి వెళ్ళిపోయాడు.

సుభద్రకి అతను జవాబేమీ యిక వ్రాయలేదు—ఆతరువాత.

ప్రొద్దు వాటారిపోయింది. అక్కా-బావా జాడలేదు.

సాయంత్రపు చీకట్లు క్రమ్ముతున్నాయి. శివరావు లేచి తన గది లోకి నడిచాడు—పాపని చూడ్డానికి. పాపని లోపల మంచంమీద వేశారు. నిద్రపోతోంది.

అప్రయత్నంగా కిటికీలోనించి పెరట్లోకి అతని దృష్టి ప్రసరించింది. ఆ చిమ్మచీకటిలోకూడా పెరడు దిశగా కనిపించింది. ఒక్క అంగలో కిటికీదగ్గరగా వెళ్ళి, కళ్ళు నలుపుకుని మళ్ళా చూచాడు. లేదు. ఊహూఁ నిజంగానే లేదు—భ్రమగాదు. ఎప్పుడూ యెదురుగా, నిటారుగా వుండే ఎర్రగులాబీచెట్టు లేదు-లేనేలేదు !

చటుక్కున వెనక్కి తిరిగాడు. అప్పుడే వచ్చింది ఇందిర గదిలోకి.

"గులాబీచెట్టు లేదేం ?" అన్నాడు గాబరాగా.

"లేదు. ఆ దిక్కుమాలిన చెట్టుమీద మీకెందుకు మమకారం ?" అంది నిర్లక్ష్యంగా.

"ఆఁ !" అన్నాడు శివరావు.

"ఆ చెట్టు కొట్టించి పెంటకుప్పమీద వేయించాను. నేలంతా చదునుచేసి యిసక పోయిస్తున్నాను. పాప ఎదిగినతర్వాత ఆడుకుంటుంది.

"నీవా! కొట్టించావా! ఎవర్నడిగి?"

"ఏం, ఆ చెట్టువల్ల యేం లాభం? ఇదిగో ఆఖరిని ఒక్క పువ్వుంటే కోసుకొచ్చాను" అని ముక్తసరిగా అంటూ, తన వెనక నడుంమీద ముడుచుకున్న చేతులు ముందుకుతీసి, చేతిలోవున్న పువ్వును చూపించింది.

ఇంతవరకూ మతిబోయినవాడిలా, ఇందిరముఖం చూస్తూ నిలబడ్డ శివరావుకి మతివచ్చింది. ఆఖరుసారి పువ్వుని యింత దగ్గరగా చూచింది యెప్పుడు? ఈ పరిమళం తన నావరించిం దెప్పుడు? ఇప్పుడీ చేతుల్లోనా? ఆనాడు?—ఔను, ఆనాడు తన ఆరాధ్యదేవతకి అంతిమ అలంకారంగా, నల్లటి జుట్టులో యీ రక్తవర్ణపు పువ్వు అమర్చాడు. అదే కడసారి చూపు.

శివరావు పిచ్చివాడిలా బైటికి దూకి వెళ్ళిపోయాడు ఆ గదిలోనించి.

ఇందిరకి అర్థంలేని ఆవేశం వచ్చింది. అలాగే నిలబడివుంది.

అప్పుడే బండిదిగిన సుభద్ర కాళ్ళు కడుక్కొని గదిలోకివచ్చింది. వస్తూనే మంచంమీదికి వొంగి, నిద్రలోవున్న పాపాయిని తృప్తిగా తల నిమురుతూ, "చిట్టితల్లీ! పేరేం పెట్టారమ్మా, మా చిరంజీవికి, మీరు. మీ అమ్మగారి పేరా, మా పిన్నిగారి పేరా?" అంది ఇందిరకేసి చూస్తూ.

"మమ్మల్ని అడిగారా ఆయన? అదీగాదు, ఇదీగాదు. మా యింటా-ఒంటాలేని పేరు. ఏదో కుసుమట-కుసుమ!" అంది ఇందిర.

అప్పుడే గదిలోకి వస్తున్న అంకయ్యగారు "కుసుమా! కుసుమా!" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఏం అల్లా అన్నారూ?" అంది ఆశ్చర్యంగా ఇందిర.

"ఏమీలేదమ్మా. నిన్ను భగవంతుడు ఆశీర్వదిస్తాడు, ఆ చిన్న తల్లినీ, నిన్నునన్నూ" అన్నాడు.

"అంటే? చెప్పండి" గట్టిగా అడిగింది ఇందిర.

"కుసుమ నా కూతురమ్మా. నా ఒకే ఒక కూతురు. అదిగో, ఆ గ్రూపుఫొటోలో మధ్యన వున్నది అదే. చాలా చదువరి" అన్నాడు అమాయకపు అంకయ్య పటంచూపిస్తూ.

"ఆఁ! అదా సంగతీ! నీ కూతురా? ఆ ముదనష్టపుపేరు నా కూతురుకి పెట్టాడా ఆయన? అందుకా అంత మమకారం, ఆ పేరు మీద!" అంది కళ్లెర్రచేస్తూ ఇందిర.

చేసిన పొరపాటు వెంటనే గ్రహించుకున్నాడు, అంకయ్య. "కోపగించుకోకు అమ్మా. ఏ పాపమూ లేదు. నీ కే కొరతా వుండదు. నీ సుఖమే మేమంతా కోరేది" అన్నాడు హృదయపూర్వకంగా. "వస్తూం టేనే, ఆ పేరు వినపడ్డదమ్మా. నా కడుపులో యేదో దేవినట్టయింది. పైకి మాట జారానమ్మా. నాది కన్నకడుపు. అర్థంచేసుకో తల్లీ!" అన్నాడు ప్రాధేయపడుతూ.

"ఇందిరా! భయపడకు. నా కూతురు లేదు. చనిపోయింది. మా కడుపులో చిచ్చుపెట్టి కాన్వకేషనురోజునే పోయింది. పొరపాటున నిప్పంటుకుంది. మరచిపో. మా అమ్మగదూ!" అంది సుభద్ర.

"ఆఁ! ఐతే అన్నీ యిప్పు డర్థమైనాయి! నా కర్థమైనాయి! నీ కూతురు చిచ్చుపెట్టింది మీక్కాదు, మా కొంపకి. ఇన్నాళ్లూ యీ మని షికి నిప్పంటే భయం—నామీద ప్రేమచేతనుకున్నాను. ఏం నంగనాచిలా ప్రవర్తించాడు—ఈ యింటాయన యిన్నాళ్లూ. ఈవేళ తేలిపోయింది. ఆ ఫొటోలోవున్నది దయ్యం! అది చచ్చి దయ్యమై మా కొంపకి చుట్టు కుంది. ఆ దయ్యం యింకా మమ్మల్ని సాధిస్తూనేవుందన్నమాట. దాని

సంగతీ, ఈ యింటాయనసంగతీ యీ వేళ ప్రపంచానికి తెలియాలి. నేను బయటపెడతా. ఏమిచేస్తానో చూడు!" అరుచుకుంటూ పరుగెత్తుకుని ప్రక్కనవున్న దేముడిగదిలోకి వెళ్ళి టకటక గడియ వేసుకుంది.

వెంటనే వెనక పరిగెత్తుకుంటూ వెళ్ళి సుభద్ర బిగించిన తలుపులు "తలుపు తియ్యమ్మా, తియ్యి!" అని అరుస్తూ కాళ్లా-చేతులా గట్టిగా దబదబమని కొడుతోంది.

"ఓ శివా! శివా!" అంటూ వీధివేపూ, పెరటివేపూ గాబరాగా పరిగెత్తాడు అంకయ్య.

శివరావుని పిల్చుకుని లోపలికి పరిగెత్తుకుంటూ వచ్చేసరికల్లా ఇంట్లోనించి కేకలూ, గోలలూ వినిపించినయ్. మనుష్యులు పరిగెత్తుకొస్తున్నారు. ఇంటిపై పెంకులకప్పులోనించి యిల్లు తగలబడ్డంత పొగ క్రమ్ముతూంది.

అంతే. తలుపులు విరగకొట్టి లోపల ప్రవేశించేటప్పటికల్లా అంతా అయిపోయింది. "గదిలో మూలనున్న కిరసనాయిలు మీదపోసుకుని దేవుడుదీపం అంటించుకుంది.

—ఎంత అఘాయిత్యం! అయ్యోయ్యో!" అంటూ చుట్టూ జనంలోనించి కేకలు వినిపించినయి.

"అమ్మో! అమ్మో!" అంటూ ఇందిరకేసి పరిగెత్తబోయాడు శివరావు.

"బాబూ, ఐపోయింది. అక్కడవున్నది కట్టె. మతిపోయివున్నావు. నీవూ గాయపడితే యెల్లాగ! నీవు చెయ్యగలిగింది యేమీలేదు. నీకు వెనక కదలలేని నాన్నగారు, పాపాయి వున్నారు, రా" అంటూ తన

వైపు లాక్కుని అదిమి కావిలించుకున్నాడు, అంకయ్యా దుఃఖం అపుకుంటూ.

చూడలేక శివరావు, అంకయ్య భుజంమీద తలపెట్టి, కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

ఆరిపోతూన్న ఆ నిప్పులకు కొంచం దూరంగా చెదిరివచ్చి పడినట్టూ, కాస్తకూడా కాలకుండా, కమలనైనా కమలకుండా, యేమీ కందకుండా, రాత్రి దీపాల వెలుగులో పడివుంది, ఇందిర చేతిలో—ఇందాక జ్ఞణించీవున్న ఆ ఆఖరి ఎర్రగులాబీపువ్వు—అదీ ఒక నిప్పుకణంలా!

* * *